సాక్షి ఏలూరు

మంగళవారం ၊ 14 ၊ జనవరి ၊ 2025



రసవత్తరంగా పోటీలు

నూజివీడు డీఏఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. క్వార్టర్స్‌లో జట్లు సోమవారం హోరాహోరీగా తలపడ్డాయి. 8లో



ఉత్తమ నాటికగా (అ)సత్యం

ఈనెల 10వ తేదీ నుంచి రాయకుదురులో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటిక పోటీల్లో మొదటి ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి వారి (అ)సత్యం నాటిక నిలిచింది. 8లో



వేరుశనగ విత్తనాల సస్యరక్షణ

వేరుశనగ కోతలు పూర్తయ్యాక జాగ్రత్తలు పాటిస్తేనే విత్తనాలు పనికివస్తాయి. పంట తగిన తేమ వచ్చే వరకు మొక్కనుంచి కాయలను వేరు చేయడానికి ముందు ఎండబెట్టాలి. 8లో

న్యూస్‌రీల్

క్షేత్రంలో ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు



ద్వారకాతిరుమల క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు, గోదాదేవి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. దాంతో నెలరోజుల పాటు తిరువీధుల్లో జరిగిన గ్రామోత్సవాలు సైతం ముగిశాయి. ఆఖరి రోజు స్వామి, అమ్మవార్లు, గోదా దేవి తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ముందుగా అర్చకులు ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం హారతులిచ్చారు. ఆ తరువాత స్వామి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, గజ, అశ్వ సేవల నడుమ క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని విలాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

గంగిరెద్దుకు క్యూఆర్ కోడ్



గణపవరం : సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దుకు క్యూఆర్ కోడ్ పెట్టి డిజిటల్ పేమెంట్ చేయొచ్చని చందాలు అడగడం అందరినీ ఆకర్షించింది. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుతో విన్యాసాలు చేయించి ఎంతో కొంత ఇవ్వాలని కోరుతుంటారు. చాలామంది జేబులో చిల్లర లేదు.. మళ్లీ వచ్చినప్పుడు ఇస్తానులే అంటూ తప్పించుకుంటుంటారు. ఇలాంటి వారిని వదలకుండా గణపవరంలో గంగిరెద్దులను ఆడించే కుటుంబం గంగిరెద్దు మొహానికి క్యూఆర్ కోడ్‌ను అమర్చి .. జేబులో డబ్బులు లేకపోతేనేం.. డిజిటల్ పేమెంట్ చేయమంటున్నారు.

కూటమి పాలనలో కష్టాల పాలు

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం మొదలయ్యాక టైలర్లకు కష్టాలు ప్రారంభం అయ్యాయని టైలర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం గణేష్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి టైలర్‌కు రూ. 10 వేలు పడేవని.. అందువల్ల టైలర్లకు ఎంతో కొంత లబ్ధి చేకూరేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేతి వృత్తిదారులను పట్టించుకోవడం మానేసిందన్నారు. గత ప్రభుత్వం టైలర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను కూడా నియమించిందని ఏపీ టైలర్స్ వర్కర్స్ హెల్పర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడిగడప ఆంజనేయరాజు అన్నారు. టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్‌ను ప్రకటించాలని, రూ.10 వేల చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో శంకు కృష్ణ, రెహమాన్, శ్రీధర్, గంగోత్రి సత్యనారాయణ, స్వాగత్ ఖాసిం, స్వామి వెంకన్న, సిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీకి సంబంధించి వివిధ అనుబంధ విభాగాలకు జిల్లా అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా ఏలూరుకు చెందిన సముద్రాల దుర్గారావును, వాణిజ్య విభాగానికి జిల్లా అధ్యక్షుడిగా పోలవరానికి చెందిన తలారి ప్రసాద్‌ను నియమించారు. పార్టీ వైద్యుల విభాగానికి జిల్లా అధ్యక్షుడిగా చింతలపూడికి చెందిన డాక్టర్ కేవీఎస్‌రామకృష్ణను, బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడిగా చింతలపూడికి చెందిన చింతా అనిల్ కుమార్‌ను నియమించినట్లు తెలిపింది. అనుబంధ మున్సిపల్ విభాగ కమిటీకి రాష్ట్ర కార్యదర్శులుగా జిల్లాకు చెందిన పగడాల సత్యనారాయణ, తంగెళ్ళ రామమోహన్‌ను నియమించారు.



భీమడోలు మండలం గుండుగొలనులో కోడిపందేలు తిలకిస్తున్న జనం



పెదవేగి మండలం దుగ్గిరాలలో చింతమనేని నిర్వహణలో బరి

బరిలో పందెంకోడీ

- జిల్లాలో ఊరూరా కోడిపందేలు, పేకాట శిబిరాలు
- జిల్లా వ్యాప్తంగా 140 బరుల ఏర్పాటు
- రూ. 50 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకూ చేతులు మారిన వగదు
- కూటమి ఎమ్మెల్యేల నేతృత్వంలో శిబిరాల నిర్వహణ
- చింతలపూడిలో ఏలూరు ఎంపీ చేతుల మీదుగా పందేలు ప్రారంభం
- దుగ్గిరాలలో చింతమనేని నేతృత్వంలో భారీ ఎత్తున కోడిపందేల బరి
- జిల్లాలో ఎక్కడ కనిపించని పోలీసింగ్



గుండుగొలనులో సై అంటున్న కోళ్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : సంక్రాంతి పండుగకు పందెంకోడే గెలిచింది. పోలీసుల హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోలేదు. గ్రామగ్రామాన కూటమి నేతల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కోడిపందేల బరులు వెలిశాయి. ఉదయం నుంచే పందేలు ప్రారంభించేశారు. వాటి మాటున జూదం, తాగుడు పెద్ద ఎత్తున ప్రజల జేబులకు చిల్లుపెట్టాయి. అనేక చోట్ల ప్రజాప్రతినిధులే నిర్వాహకులుగా మారి పందెంరాయుళ్లను పెద్ద సంఖ్యలో ఆహ్వానించడంతో పాటు మద్యం సకల సౌకర్యాలు బరుల వద్దే ఏర్పాటు చేయించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 140కి పైగా పందెం బరుల్లో సగటున రూ.50 నుంచి రూ.70 కోట్ల వరకూ బెట్టింగ్‌లు సాగాయి.

ఏలూరు జిల్లాలో సంక్రాంతి కోడిపందేలు సోమవారం తారా స్థాయిలో జరిగాయి. గత ఏడాది కంటే రెట్టింపు సంఖ్యలో కోడిపందేల శిబిరాలు వెలిశాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే అన్నిచోట్లా భారీగా పందేలు ప్రారంభమయ్యాయి. పందేలు నిషేధమంటూ పోలీసులు ప్రతి మండలంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ఎవరూ ఖాతరు చేయలేదు. వాటి సమీపంలోనే పందెం బరులు కొనసాగడం విశేషం. ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో పందెంరాయుళ్లు తరలి వచ్చారు. పండుగ రోజు పోలీసింగ్ ఎక్కడా కనిపించని పరిస్థితి. ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన పందేలరాయుళ్ల వాహనాలతో రహదారులు కిటకిటలాడాయి. విచ్చలవిడిగా జూద శిబిరాలు నడిచినా ఎక్కడా పోలీసుల జాడ లేదు. మొక్కుబడిగా నాలుగు రోజుల క్రితం ఏలూరు జిల్లాలో 30 పందెం బరులను పైపైన ధ్వంసం చేసి కోడిపందేలను కట్టడి చేశామని ప్రకటించుకున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల సమీపంలోనే కోడిపందేల బరులు ఏర్పాటు చేసి నిర్వహించడం గమనార్హం.



ఏలూరు రూరల్ కోడేరులో తలపడుతున్న పందెం కోళ్లు

జిల్లా వ్యాప్తంగా..

- దెందులూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ భారీ కోడిపందేల బరిని ఏర్పాటుచేశారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని తన నివాసం సమీపంలో భారీ సెట్టింగ్‌లతో బరిని ఏర్పాటు చేసి ఎంట్రీ టిక్కెట్ కూడా పెట్టారు. వంద మందికి పైగా ప్రైవేట్ సైన్యంతో తనిఖీ చేసి పందేల్లోకి అనుమతించారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో దూర ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు తరలి వచ్చారు. చింతమనేని ప్రభాకర్ అక్కడే ఉండి పందేల్లో పాల్గొన్నారు.
- పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరుల వద్ద మూడు బుల్లెట్లను బహుమతిగా అందజేస్తున్నారు. కోడిపందేల బరితో పాటు, బహుమతి బుల్లెట్‌ను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. ప్రతీరోజు ఎవరు ఎక్కువ పందేలు గెలుస్తారో వారికి బుల్లెట్‌ను బహుమతిగా అందిస్తారు. బుట్టాయగూడెంలో తహసిల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే కోడిపందేలు నిర్వహించడం గమనార్హం. కుక్కునూరు మండలం వేలేరులో కోడి పందేల కోసం వచ్చిన వారి వాహనాలు రోడ్డు వెంట నిలపడంతో రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి.
- కైకలూరు నియోజకవర్గం చావలిపాడులో కోడి పందేలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. పొట్టేళ్ల పందేలు కూడా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి 30 మంది బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్నారు. కైకలూరు మండలం బుజబలపట్నం, కలిదిండి మండలం పోతుమర్రు, మండవల్లి మండలంలో భైరవపట్నం, ముదినేపల్లి మండలం బొమ్మనంపాడులో భారీగా పందేలు జరిగాయి.
- ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, గుండుగొలను, ఉంగుటూరు, నారాయణపురం, గణపవరంలో భారీగా బరులు ఏర్పాటు చేశారు. అత్యధికంగా రూ.25 లక్షల వరకు పందేలు నిర్వహించారు. నిడమర్రు మండలం పత్తేపురంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరిని ఎమ్మెల్యే పి.ధర్మరాజు పరిశీలించారు. నారాయపురంలో కోడిపందేలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. ఖమ్మం, కృష్ణా జిల్లా నుంచి పందెంరాయుళ్లు హాజరయ్యారు.
- చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం మండలం కలరాయనగూడెంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోడిపందేలను ప్రారంభించారు. చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన కోడిపందేల బరి వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఎస్.భద్రయ్యపై దాడి జరిగింది. గుండాట శిబిరం వద్ద గొడవ జరుగుతుండగా, అపడానికి వెళ్లిన భద్రయ్యపై దాడి చేసి గాయపరిచారు.



పందెం కోడికి జలకొడుతున్న దృశ్యం



గుండుగొలనులో బరి వద్ద పేకాట



గుండుగొలనులో హెచ్చరిక ఫ్లెక్సీ వద్దే పందేలు



భీమడోలు మండలం గుండుగొలనులో కోడిపందేలకు భారీ ఏర్పాట్ల దృశ్యం



ఏలూరు రూరల్ కోడేరులో జోరుగా గుండాట



మండవల్లి మండలం చావలిపాడులో తెలంగాణ నుంచి వచ్చిన మహిళా బౌన్సర్లు



దెందులూరు మండలం కొవ్వలిలో భోగి మంటలు



ఎడ్లబండి పై చిన్నారులు

పల్లె సంక్రాంతి

దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక సంబరాలు నిర్వహించారు. గ్రామదీప్ సంస్థ ఆధ్వర్యంలో పల్లె వాతావరణం ఉట్టిపడేలా వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



చిన్నారుల నృత్య ప్రదర్శన

భోగి మంటల్లోకి విద్యుత్ బిల్లులు

ఏలూరు (టూటౌన్) : పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు ఆర్ ఆర్ పేట సుందరయ్య గ్రంథాలయం వద్ద విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి డీఎన్ వీడి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలల్లో రూ.16 వేల కోట్ల అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందని, విద్యుత్ చార్జీలు పెంచుతున్నామని చెప్పకుండా దొడ్డిదారిన ట్రూఅప్ చార్జీల భారం వేసిందని విమర్శించారు. ఈ నెల నుంచి మళ్లీ 45 నుంచి 50 పైసలు మేర చార్జీలు పెంచబోతున్నారని అయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు ఎందుకు పెంచారంటే గత ప్రభుత్వం పెంచిందని తమ తప్పు లేదని కూటమి నేతలు చెప్పడం తగదని, గత ప్రభుత్వ విధానాలను సమీక్షించి మార్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై లేదా? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని గతంలో లోకేష్ చెప్పారని, నేడు మంత్రి అయ్యాక వాటిని బిగించాలని చెప్పడంలో ఆంతర్యం ఏంటని నిలదీశారు. విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహరావు, నగర నాయకులు వైఎస్ కనకారావు, కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాక్, కె.లెనిన్, బి.సోమయ్య పి.ఆదిశేషు, కే విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు సుందరయ్య గ్రంథాలయం వద్ద భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కనుల పండువగా గోదా రంగనాథుల కల్యాణం



శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో గోదా రంగనాథుల కల్యాణ తంతు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శ్రీ గోదా, రంగనాథుల కల్యాణ వేడుక సోమవారం ఉదయం కనుల పండువగా జరిగింది. శ్రీ రంగనాథుని భక్తురాలైన గోదాదేవి ధనుర్మాసంలో నెల రోజులపాటు పాసురాల ద్వారా స్వామివారిని కీర్తించి, ఆ తర్వాత వివాహమాడతారు. అట్టి వేడుకను శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యార్జిత కల్యాణంతో పాటు, గోదాదేవిని ఉంచి అర్చకులు కల్యాణ తంతును వైభవోపేతంగా జరిపారు. భక్తుల గోవిందనామ స్మరణలు, అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాలు వేడుకను ఘనంగా జరిపారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్లుప్తంగా

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు (టూటౌన్): రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్సై సైమన్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో, నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 50-55 సం.ల వయస్సు ఉంటుంది. లేత బిస్కెట్ రంగు చొక్కా, ముక్కు పొడుం రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు సెల్ 99892 19559 నంబర్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్సై సైమన్ కోరారు.

నూజివీడు చిన్న రసానికి పేటెంట్ హక్కు కల్పించాలి

నూజివీడు: దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సాధించిన నూజివీడు చిన్న రసానికి పేటెంట్ హక్కు కల్పించాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి హరినాథ్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 10.75 లక్షల ఎకరాల్లో మామిడి పంట సాగవుతోందని మామిడి ఎగుమతిలో ఉత్తర ప్రదేశ్ ప్రథమ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలోనూ ఉన్నాయని పేర్కొన్నారు. భూసార పరీక్ష కేంద్రాన్ని నూజివీడులో ఏర్పాటు చేయాలని, మామిడి పరిశోధన కేంద్రానికి 100 ఎకరాలు కేటాయించాలని, 70 శాతం రాయితీ మీద ట్రేడింగ్ షెడ్లు, డ్రిప్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేయాలని హరినాథ్ కోరారు. నూజివీడు నుంచి ఏలూరు తరలించిన ఉద్యానశాఖ ఏడీ ఆఫీసును తిరిగి నూజివీడులో ఏర్పాటు చేయాలన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కొయ్యలగూడెం: లారీ ఢీకొని యర్రంపేట (గొల్లగూడెం) గ్రామానికి చెందిన మహిళ మృతి చెందినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. వామిశెట్టి సుబ్బలక్ష్మి (64) ఉదయం పాలు తీసుకురావడానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా లారీ వెనక నుంచి ఢీకొంది. సుబ్బలక్ష్మిపై నుంచి లారీ వెళ్లడంతో శరీరం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రం అయిందని ఎస్సై తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను నిమిత్తం వచ్చిన లారీగా గుర్తించామని దీనికి సంబంధించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మృతురాలు సుబ్బలక్ష్మి కుమారుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

దళితుల నిరసన ర్యాలీ



గ్రామదీప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

దెందులూరు: గ్రామదీప్ నిర్వాహకురాలు మనోహరిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కొవ్వలిలో దళితులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, కొవ్వలి దళిత పెద్దలు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి తమ పూర్వీకులు కొవ్వలిలో ఒక పంటను సాగు చేసుకుని జీవిస్తున్నారన్నారు. కుటుంబపోషణ భారంగా ఉండటంతో గత రెండేళ్లుగా రెండో పంటను సైతం సాగు చేసుకుంటున్నామన్నారు. పేదలందరికీ 10 సెంట్లు, 20 సెంట్లు మాత్రమే ఉందని వాటిలో కేవలం సాగు చేసుకుని జీవనాధారం పొందుతుంటే గ్రామదీప్ నిర్వాహకురాలు ఏవేవో సాకులు చెబుతూ కోర్టులకి వెళుతూ దాదాపు 700 మంది పేద దళితుల జీవనాన్ని రోడ్డుపై పెట్టారన్నారు. ప్రభుత్వం, కోర్టులు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. గ్రామ పెద్దలు బూసి ఏబ్రాయూ, కీర్తిరాజు, కాటి అర్జున్ కృష్ణ, ప్రత్తిపాటి సుధాకరరావు, గ్రామస్తులు, మహిళలు 300 మంది ర్యాలీలో పాల్గొన్నారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు

- నేడు మహిళల, పురుషుల సెమీస్, ఫైనల్ పోటీలు



ఏపీ పోలీస్, నెల్లూరు జట్ల మధ్య ఆసక్తికరంగా బాస్కెట్‌బాల్ మ్యాచ్

నూజివీడు: నూజివీడు డీఏఆర్ కళాశాలలో ఈనెల 12 నుంచి నిర్వహిస్తున్న రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 48వ స్మారక పురుషుల, మహిళల జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీల్లో లీగ్ మ్యాచ్‌లు ముగిసి, క్వార్టర్స్‌కు చేరిన జట్లు సోమవారం హోరాహోరీగా తలపడ్డాయి. పలు జట్లలో క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి తమ జట్లను విజయపథంలో నడిపించారు. మహిళల విభాగంలో సెయింట్ ఫ్రాన్సిస్ హైదరాబాద్, ఏలూరు, వీటీహెచ్ నూజివీడు, డీఎస్ఏ పల్నాడు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. సెయింట్ ఫ్రాన్సిస్ జట్టు సీబీసీ రాజమండ్రిపై 33-18 తేడాతో, ఏలూరు జట్టు స్వస్తిక్ హైదరాబాద్‌పై 32-23 తేడాతో, వీటీహెచ్ జట్టు గుడివాడపై 25-12 తేడాతో, డీఎస్ఏ పల్నాడు జట్టు చిత్తూరుపై 31-25 తేడాతో గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరాయి. పురుషుల క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్‌ల్లో ఏపీ పోలీస్, హెచ్ ఫౌండేషన్ గుంటూరు, లయోల హైదరాబాద్, స్వస్తిక్ హైదరాబాద్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఏపీ పోలీస్ జట్టు నెల్లూరుపై 51-37 తేడాతో, హెచ్ ఫౌండేషన్ జట్టు వీజీ బౌలర్స్ హైదరాబాద్‌పై 45-28 తేడాతో, లయోలా హైదరాబాద్ జట్టు గుంటూరుపై 50-41 తేడాతో, స్వస్తిక్ హైదరాబాద్ జట్టు జీ మామిడాడపై 63-47 స్కోర్ తేడాతో గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరాయి. ఈనెల 14న పురుషుల, మహిళల సెమీస్, ఫైనల్స్ మ్యాచ్‌లతో పాటు మూడు, నాలుగు స్థానాలకు మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి సాధన పోటీలను పర్యవేక్షించారు.

ఏపీ టీం కంటింజెంట్ చీఫ్‌గా వెంకట్రామయ్య



వెంకట్రామయ్య

ఏలూరు రూరల్: జాతీయ క్రీడల కోసం ఏపీ టీమ్ కంటింజెంట్ చీఫ్ డి మిషన్‌గా బడేటి వెంకట్రామయ్య నియమితులైనట్లు ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి దినేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకూ ఉత్తరాఖండ్‌లోని 9 నగరాల్లో 35వ జాతీయ క్రీడలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 14, 15 తేదీల్లో డెహ్రాడూన్‌లో జరగనున్న ప్రత్యేక సమావేశానికి ఏపీ టీమ్ కంటింజెంట్ చీఫ్ ది మిషన్ వెంకట్రామయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. 2011లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ డిప్యూటి కాంపిటేషన్ మేనేజర్‌గా సేవలు అందించిన బడేటిని మరోసారి డి మిషన్‌గా నియమించారని పేర్కొన్నారు.



జాతీయస్థాయి ఉత్తమ నాటికగా (అ)సత్యం

- ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు
- కళాకారులకు సత్కారాలు



నటులకు సత్కారాలు చేస్తున్న నిర్వాహకులు

వీరవాసరం: శ్రీకృష్ణదేవరాయ నాటిక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి రాయకుదురులో నిర్వహిస్తున్న పంచమ జాతీయస్థాయి నాటిక పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతల వివరాలను ప్రకటించి బహుమతులను అందజేశారు. మొదటి ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి ఉక్కునగరం వారి (అ)సత్యం నాటిక సాధించగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా శార్వాణీ ఫైన్ ఆర్ట్స్ బోరువంక వారి కొత్తపరిమళం నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నటీనట సంక్షేమ సమైఖ్య పాలకొల్లువారి «అనూహ్యం» నాటికలు నిలిచాయని కళాపరిషత్ అధ్యక్షుడు గోపాలకృష్ణ కేఎస్ఆర్‌కే తెలిపారు. ఉత్తమ దర్శకత్వం (అ)సత్యం నాటికకు బాలాజీ నాయక్, ఉత్తమ రచనగా పిన్నమనేని మృత్యుంజయరావు, ఉత్తమ నటుడు కొత్తపరిమళం నాటిక డాక్టర్ గోపాల్ పాత్రధారి మెట్టా పోలినాయుడు, ఉత్తమ నటి మలిసంధ్య నాటికలోని సంధ్యా పాత్రధారి జ్యోతిరాణి, ఉత్తమ క్యారెక్టర్ నటుడు చిగురుమేఘం నాటికలోని చెన్నయ్య పాత్రధారి కావూరి సత్యనారాయణ, ఉత్తమ ప్రతినాయకుడు కొత్తపరిమళం నాటికలోని ఉస్మాన్‌ఖాన్ పాత్రధారి ఎన్ వెంకట్రాజు, ఉత్తమ హాస్యనటుడు అనూహ్యం నాటికలోని ధనుష్కోటి పాత్రధారి గుడాల హరిబాబు, ద్వితీయ ఉత్తమ నటుడు విడాకులు కావాలి నాటికలోని శ్రీనివాసరావు పాత్రధారి గంగోత్రి సాయి, ఉత్తమ సంగీతం కొత్తపరిమళం నాటిక డీ రాజశేఖర్, ఉత్తమ రంగాలంకరణ చిగురు మేఘం నాటిక రామ్మోహన్, ఉత్తమ ఆహార్యం కొత్తపరిమళం నాటికలోని ఎస్ రమణ ఎంపికయ్యారు. న్యాయ నిర్ణేతలుగా అల్లు రామకృష్ణ, కొడమంచిలి సత్యప్రసాద్, గంటా ముత్యాలరావు నాయుడు వ్యవహరించారు. ముందుగా మందుల స్మారక రంగస్థలం నటరత్న అవార్డుతో గంగోత్రి సాయిని సత్కరించారు. గోటేటి ప్రసాద్ శ్రీనివాసరావుల స్మారక నటరత్న అవార్డు కత్తుల రామ్మోహనరావుకు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది జీ శివకుమార్, గోటేటి శ్రీనివాసరావు, సర్పంచ్ గెద్దం భారతీ, చవ్వాకుల సత్యనారాయణ, గుండా రామకృష్ణ, వంగా నర్సింహారావు, తాబత్తుల వెంకటేశ్వరరావు, గెద్దం భాస్కరరావు జవ్వాది దాశరధి, శ్రీనివాస్ పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలను భద్రపరుచుకుందాం ఇలా

పాడి - పంట



మెట్ట ప్రాంతంలో వేరుశనగ కాయలను పీకుతున్న వ్యవసాయ కూలీలు

చింతలపూడి: దేశంలో పండించే నూనె గింజల పంటల్లో వేరుశనగ పంట అతి ముఖ్యమైంది. ఇటీవల మెట్ట ప్రాంతంలో వేరుశనగ విస్తీర్ణం బాగా పెరిగింది. వేరుశనగ కోతలు పూర్తయ్యాక సరైన జాగ్రత్తలు పాటిస్తేనే రాబోవు కాలంలో విత్తనాలు పనికివస్తాయి. లేదంటే పుచ్చుపట్టి పనికి రావు. వేరుశనగ లో కోసిన పంటను తగిన తేమ (9 శాతం) వచ్చే వరకు మొక్కనుంచి కాయలను వేరు చేయడానికి ముందు ఎండబెట్టాలి. వేరుశనగ విత్తనాలను భద్రపరుచుకుని వచ్చే పంటకు ఉపయోగించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి నాగకుమార్ రైతులకు సూచించారు.

వేరుశనగ ఎండబెట్టే విధానం

ఇది రెండు రకాలుగా చేయవచ్చు. వేరుశనగ కాయలు పై భాగానికి వచ్చేటట్లు చెట్లను చిన్న, చిన్న కుప్పలుగా వేయాలి. లేదా మొక్కలను కర్రలకు కట్టి కాయలను పక్కలకు వచ్చేటట్లుగా చేసి ఎండబెట్టుకోవచ్చు.

తేమశాతం తగ్గించడం ఇలా..

కాయల్లో తేమ శాతం ఎక్కువగా ఉంటే ఎండలో ఆరబెట్టకుండా తేమను 7, 8 శాతానికి తీసుకురావాలి. వేడి గాలులను వదిలే పరికరాలను ఇందుకు ఉపయోగించవచ్చు. వేరుశెనగ పంటను నిల్వ చేయడానికి ఒకసారి వాడిన సంచులను మరలా వాడకూడదు. పాలిథిన్ పేపర్ ఉన్న గోనె సంచులు బాగా ఎండిన వేరుశనగ కాయలను నిల్వ చేయడానికి ఉపయోగం.

ఎండలో ఆరబెట్టకూడదు

ఖరీఫ్ సీజన్‌లో ఉష్ణోగ్రతలు పర్వాలేదనిపించినా, రబీ కాలంలో వేరుశనగ కాయలు పీకేటప్పుడు వాతావరణం ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉంటుంది. కాబట్టి కాయలను నేరుగా ఎండలో ఆరబెట్టకూడదు. నీడలో ఆరబెట్టాలి. లేదా ఎండ తీవ్రత ఉదయం 11 గంటల వరకు సాయంత్రం 4 గంటల తరువాత తక్కువగా ఉంటుంది కాబట్టి ఆయా సమయాల్లో ఆరబెట్టుకోవాలి. ఎండబెట్టే సమయంలో వేరే రకాల కాయలు కలవ కుండా చూసుకోవాలి.

వేరుశనగ కాయలను నిల్వ చేసుకునే విధానం

వేరుశనగ విత్తనం కోసం బాగా ముదిరిన కాయలను నిల్వ చేసుకోవాలి. కాయలను కదిలిస్తే గల్లుమని శబ్దం రావాలి. అప్పుడే బాగా ఎండినట్లు అర్థం. కాయలను నిల్వ చేసుకోవడానికి శుభ్రమైన లోపల పాలిథిన్ లైనింగ్ ఉన్న గోనె సంచులను వాడాలి. గోనె సంచులను 0.5 శాతం మలాథియాన్ ద్రావణంలో ముంచి బాగా ఆరబెట్టుకోవాలి. దీనివల్ల కాయల్లోని గింజలకు శిలీంద్రాల బెడద ఉండదు.



బి నాగకుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు, చింతలపూడి

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి



దాడిలో గాయపడిన నల్లంటి భద్రయ్య

జంగారెడ్డిగూడెం: కోడిపందాల్లో జరుగుతున్న ఘర్షణను ఆపేందుకు ప్రయత్నించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తపై గుండాట నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పేరంపేట గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందాలను చూడటానికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నల్లంటి భద్రయ్య వెళ్లాడు. అక్కడే గుండాట శిబిరం వద్ద జరుగుతున్న గొడవలో కలపాల నాగరాజు అనే వ్యక్తిని కొట్టడాన్ని చూసిన భద్రయ్య ఆపేందుకు ప్రయత్నించాడు. గుండాట నిర్వాహకులు, టీడీపీకి చెందిన కోడిపందాల శిబిరం కమిటీ సభ్యులు భద్రయ్యను కొట్టి గాయపర్చారు. దీంతో తీవ్రగాయాలపాలైన భద్రయ్యను అతని మేనల్లుడు, చిన్నకుమారుడు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● సంప్రదాయం ముసుగులో బాలలతో జూదాలు



సంక్రాంతి సంప్రదాయం ముసుగులో నిర్వహిస్తున్న పలు జూదాలు బాలల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలోని కోడి పందేల బరి వద్ద పలువురు బాలలు డబ్బులు పెట్టి పులి, మేక ఆడుతూ కనిపించారు. మిగిలిన బరుల వద్ద సైతం ఇదే పరిస్థితి కనిపించింది. వీటిని అడ్డుకునే నాథుడు లేకపోవడంతో.. పెద్దలతో తామేమీ తీసిపోమన్నట్టుగా బాలలు ఈ జూదాల్లో జోరుగా పాల్గొన్నారు. సంప్రదాయం పేరుతో పందేల బరుల వద్ద గుండాట, పులి మేక, పేకాటలు నిర్వహించడం భావితరాలను జూదాల వైపునకు మరల్చడమేనని పలువురు అంటున్నారు. – ద్వారకాతిరుమల